

మహాకుంభమేళాలో డీసీఎం



పుణ్య స్నానం ఆచరిస్తున్న ఉపముఖ్యమంత్రి దంపతులు

బెంగళూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో డీసీఎం డీకే శివకుమార్ దంపతులు పుణ్యస్నానం ఆచరించారు. ఆదివారం నొణవినకెరె కాడసిద్దేశ్వర మఠాధిపతి కరివృషభ రాజదేశికేంద్ర శివయోగీశ్వర శివాచార్య స్వామీజీతో కలసి త్రివేణిసంగమంలో స్నానం ఆచరించి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ పుణ్యస్నానం చేయడం సంతోషం కలిగించిందన్నారు. కాగా డీసీఎంకు ఉత్తరప్రదేశ్ పరిశ్రమలశాఖ మంత్రి నందగోపాల్ గుప్త ప్రయాగరాజ్ విమానాశ్రయంలో సాదరంగా స్వాగతం పలికారు.

ధారవాడలో గ్యాస్‌పైప్ లీక్

● రెండు చోట్ల మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజ్ కావడంతో ధారవాడ నగరంలోని రజతగిరి ప్రాంతంలో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రెండు చోట్ల మంటలు కొనసాగుతున్నాయి. అగ్నిమాపకశాఖ అధికారులు నాలుగు గంటలపాటు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నా నియంత్రణలోకి రాలేదు. పైప్‌లైన్ లీక్ అయిన ప్రాంతాలలోని ఇళ్లనుంచి ప్రజలను దూరంగా పంపారు. ఆ ప్రాంతంలోకి ఎవరినీ రానివ్వకుండా అడ్డుకున్నారు. పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేసి మంటలు ఆర్పే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పైప్‌లైన్‌కు వచ్చే గ్యాస్‌ను కట్టడి చేశారు. అయినా మంటలు కొనసాగుతుండడంతో హుబ్బళ్ళితోపాటు వివిధ ప్రాంతాలనుంచి అగ్నిమాపక యంత్రాలను తీసుకొచ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

బాల్యం నుంచే చదువు, క్రీడలు కీలకం

● క్రికెటర్ చాహల్

7





యలహంక ఎయిర్‌బేస్‌లో వివిధ రకాల విమానాలు



రిహార్సల్‌కు సన్నద్ధం

నేటి నుంచి.. ఏరో ఇండియా..!

● రక్షణ, పరిశోధనలకు పరస్పర సహకారం ● పాల్గొననున్న 30దేశాల రక్షణ మంత్రులు ● ఐదురోజులపాటు లోహ విహంగాల విన్యాసం

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి ఆసియాఖండంలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శనలు ఏరో ఇండియా 2025కు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఏరో-ఇండియా ప్రదర్శనలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. వందలాదిమంది వైమానిక పరిశోధకులు, రక్షణరంగ నిపుణులు, 30 దేశాల రక్షణమంత్రులు, దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగసంస్థలు హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీహెచ్‌ఈఎల్‌తోపాటు 900 మంది ప్రదర్శకులు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. 90దేశాలనుంచి రక్షణ, వైమానిక సంస్థలు భాగస్వాములయ్యాయి. వందమంది ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ పాల్గొంటున్నారు. యలహంక ఎయిర్‌బేస్‌లో జరిగే ప్రదర్శనలకు సర్వం సిద్ధం చేశారు. గతంలో చోటు చేసుకున్న పలు లోపాలు, ప్రమాదాలు, ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. రెండేళ్లకోసారి ప్రదర్శనలు కొనసాగే సంప్రదాయం ఉంది. ప్రస్తుతం 15వ విడత ఏరో ఇండియా-2025 ప్రదర్శనలను 'ది రన్‌వేటు బిలియన్ ఆపర్చునిటీస్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఐదురోజులుగా వైమానిక ప్రదర్శనల రిహార్సల్స్ కొనసాగుతున్నాయి. అసలైన లోహవిహంగాల విన్యాసం, ఆకాశంలో యుద్ధ విమానాల ప్రదర్శనలు, హెలికాప్టర్ల చక్కర్లు, సూర్యకిరణ్‌ల హల్‌చల్, తేజస్ యుద్ధ విమానాల హోరు ఆకట్టుకోనుంది.

రక్షణ, పరిశోధనలకు పరస్పర సహకారం



బ్రహ్మోస్ నమూనా



కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను స్వాగతిస్తున్న పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి

ఏరో ఇండియా ప్రదర్శనల ద్వారా రక్షణ, వైమానిక రంగంలో వివిధ దేశాలతో పరస్పర సహకారానికి శక్తివంతం కానుందని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఆదివారం ఏరో ఇండియా ప్రదర్శనలకు సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు. ఏరో ఇండియా ప్రభుత్వ శక్తివంతమైన సమర్థ భారత, సురక్షత, స్వావలంబన భారతదృష్టి కోణంతో ముందుకు సాగనుందన్నారు. ఏరో ఇండియా ద్వారా నవభారతశక్తి ప్రదర్శనలకు వేదిక కానుందన్నారు. భారత రక్షణారంగంలో నిర్ణయాత్మకమే కాకుండా దేశ భవిష్యత్తును రూపొందించడంలో కీలకపాత్ర పోషించనుందన్నారు. మన రక్షణ సామర్థ్యాలను ప్రదర్శించడంతోపాటు విశ్వవ్యాప్తంగా భాగస్వాములను చేసుకోనుందన్నారు. మన స్నేహ పరంపర కల్గిన దేశాలతో ఆసక్తిరంగాల భాగస్వామ్యం పెంచేందుకు మరింత బలమైన చేదోడు వాదోడుకు, ప్రగతి పంపిణీ మా లక్ష్యమన్నారు. ఇది కేవలం సాంకేతిక ఆధునికత ప్రదర్శన కాదని, యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందన్నారు. శాస్త్రీయ, సాంకేతిక విధానాలకు అనుగుణంగా అభివృద్ధి జరగనుందన్నారు.

● 42వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో 150 విదేశీ కంపెనీలతోపాటు 900కుపైగా ఎగ్జిబిటర్స్ పాల్గొంటున్నారన్నారు. ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఏరో ఇండియా కానుందన్నారు. 90కుపైగా దేశాలు భాగస్వామ్యం కావడం ద్వారా భారత ఏరోస్పేస్, రక్షణ సామర్థ్యం, శక్తి విశ్వవ్యాప్తంగా విశ్వాసానికి సాక్షికానుందన్నారు. 30దేశాల రక్షణమంత్రులు, వారి ప్రతినిధులు భాగస్వాములు అవుతున్నారన్నారు. 43దేశాల ఏరోస్పేస్ చీఫ్‌లు, కార్యదర్శులు పాల్గొనడం ద్వారా కేవలం భారత్‌కు మాత్రమే కాకుండా అంతర్జాతీయ రక్షణరంగానికి ఇదో మహత్తరమైన ప్రదర్శన అన్నారు.

● ఇటీవల రక్షణ, అంతరిక్ష రంగాలలో సాధనలు ప్రదర్శిస్తామన్నారు. దేశంలో తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు అభివృద్ధి పరచుకునేందుకు సమర్థవంతంగా ఎదిగిందన్నారు. లఘు యుద్ధ విమానం తేజస్, లఘు యుద్ధ హెలికేప్టర్ ప్రచండ్, సి-295 విమానాలు దేశంలోనే ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాలు దేశీయ సాంకేతికతతో ఉత్పత్తి చేసే ధృడసంకల్పాని తీసుకున్నామన్నారు. అగ్ని మిస్సైల్, అస్త్ర మిస్సైల్ వ్యవస్థ, పినాక క్షిపణి, ఆధునిక రూపాంతరంతోపాటు అత్యాధునికమైన హైపర్‌సోనిక్ మిస్సైల్ వ్యవస్థను, ఆకాశ్ వాయు రక్షణా వ్యవస్థ వరకు ఎన్నో విజయాలను సాధించామన్నారు. ఈ సాధనల ద్వారా మన రక్షణారంగం బలోపేతం చేయడంలో నిర్ణయాత్మకమైన పాత్ర సాధ్యమన్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మండలి కార్పొరేటరీకరణ తర్వాత కొత్తగా రూపొందించిన కంపెనీలు రక్షణ, ఉత్పాదనలో అసాధారణమైన ప్రగతి సాధ్యమైందన్నారు. రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలు ప్రైవేట్ రంగంలో బలోపేతం చేసేందుకు క్రియాశీలకంగా వ్యవహరించామన్నారు. ప్రస్తుతం భారత్ అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ రక్షణా పరిశ్రమలను కలిగి ఉందని, ఇది శక్తివంతమయ్యేందుకు జాతీయ భద్రతకు దోహదం కానుందన్నారు.

● రూ.1.27 లక్షల కోట్ల రికార్డులు సాధించిన రక్షణా ఉత్పత్తులు 2025-26 నాటికి 1.60 లక్షలకోట్లకు అధిగమించనుందని రక్షణమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. 21వేల కోట్ల ఎగుమతులను 30వేల కోట్ల లక్ష్యం చేరుకోనుందన్నారు. భారత్‌ను ఆర్థికంగా సూపర్ పవర్ చేయడంలో రక్షణ, పారిశ్రామిక రంగం నిర్ణయాత్మక పాత్రను పోషిస్తుందన్నారు. రక్షణారంగం ప్రగతి జాతీయ భద్రత బలోపేతంతోపాటు ఆర్థికతపైన పరిణామం చూపనుందన్నారు. రక్షణ పరికరాల అభివృద్ధి సాంకేతికత పబ్లిక్ సెక్టార్‌ను ఉత్తేజం కలిగించనుందన్నారు.ఉద్యోగాల కల్పన, ఆర్థిక అభివృద్ధి కానుందన్నారు.

● 15వ ఏరో ఇండియా ప్రదర్శనలు సోమవారం నుంచి ఈనెల 14వరకు కొనసాగనున్నాయి. 10నుంచి 12వ తేదీ వరకు బిజినెస్ డేస్‌గా, 13, 14 తేదీలు ప్రదర్శనలు ప్రజలు వీక్షించేందుకు కేటాయించారు. రక్షణమంత్రుల సమావేశం, వివిధ కంపెనీల సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశాలు, ఇండోనేషియా ప్రదర్శన, డయా అండ్ ఐడెక్స్ స్టాల్స్, మంథన్, సమర్థ్య దేశీకరణ కార్యక్రమంతోపాటు ఏరోస్పేస్ ప్రదర్శనలు కొనసాగనున్నాయి.

జిమ్‌తో మారనున్న రాష్ట్ర ప్రగతి దిశ

● రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అంచనా
● పారిశ్రామిక నిపుణులు, ఔత్సాహికులకు స్వాగతం
● భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పెట్టుబడుల సదస్సు (గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్) రాష్ట్ర ప్రగతి దిశను మార్చనుందని, ఇప్పటికే స్టార్టప్, సెమి కండక్టర్, ఐటీబీటీ, ఏరోస్పేస్ రంగాలలో గణనీయమైన అభివృద్ధి దిశగా ప్రయాణిస్తున్న కర్ణాటకకు 'జిమ్ సదస్సు' మరో గొప్ప అవకాశం కానుందని రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యే జిమ్ ఏర్పాట్లను మంత్రి ఎంబీ పాటిల్ ఆదివారం పరిశీలించారు. అనంతరం మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి మాట్లాడారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే సదస్సుకు 'ప్రగతికి మరుకల్పన' అనే నినాదం జోడించామన్నారు. ఇన్వెస్ట్ కర్ణాటక ద్వారా ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగస్వాములు అవుతారన్నారు. కనీసం 10 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. గతంలో మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటకలో మాత్రమే జిమ్ సదస్సులు నిర్వహించేవని ప్రస్తుతం పలు రాష్ట్రాలు పరిశ్రమల అభివృద్ధికోసం సదస్సులు నిర్వహిస్తున్నాయన్నారు. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమ్మేళనంలో కర్ణాటకను చేర్చారన్నారు. 19 దేశాల ప్రతినిధులు జిమ్‌లో పాల్గొంటారని, 9 దేశాల పెవిలియన్‌లను చూడవచ్చన్నారు. 60మందికి పైగా విషయ పరిజ్ఞాన నిపుణులు పాల్గొంటారన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఉత్తేజం కలిగించేలా ఎస్ఎంఈ కనెక్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 2వేలకు పైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పాల్గొంటాయన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించి 3 లక్షల డాలర్ల పెట్టుబడులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 25కిపైగా రౌండ్‌టేబుల్ సమావేశాలు జరుగుతాయన్నారు. గతంలో జరిగిన ఇన్వెస్ట్ కర్ణాటక ఒప్పందాలను సమీక్షించేది



సదస్సుకు ఏర్పాట్లు ఇలా..

లేదని అయితే గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనారంగంలో 2.40 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్నారు. అంత భారీస్థాయిలో రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశం లేదని 20-30వేల కోట్ల మౌలిక సదుపాయాల సామర్థ్యం ఉందన్నారు. గతంలో ఇన్వెస్ట్ కర్ణాటక లోపాలను సరిచేసుకుని 10లక్షల కోట్ల పెట్టుబడులకు చేసుకోదలిచామన్నారు. వీటిలో కనీసం 70 శాతం పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడమే లక్ష్యమన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా సింగిల్‌విండో వ్యవస్థ అమలులో ఉన్నా, లోపాలు ఉన్నాయని వాటిని సరిచేస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు సమయం కేటాయించడమే గొప్ప పెట్టుబడి అన్నారు. ఏడాదిలో పరిశ్రమలస్థాపన లక్ష్యం రెండేళ్లకు విస్తరింపచేయడమే లక్ష్యానికి కారణం అవుతోందన్నారు. సింగిల్‌విండో లోపాలను సరిచేసేందుకు మైక్రోసాఫ్ట్ సంస్థతో కొత్తగా ఆధునాతన వ్యవస్థతో సింగిల్ విండో వ్యవస్థను తెస్తున్నామన్నారు. భూమి, నీరు, విద్యుత్ సౌకర్యాలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియమాలకు అనుగుణంగా ఇన్సెంటివ్ వివరాలను చర్చించదలిచామన్నారు. పెట్టుబడుల ఆకర్షణకోసం కొత్త పారిశ్రామిక పాలసీ తీసుకొచ్చామని, తద్వారా 500కుపైగా ప్రపంచంలోని ఫార్చ్యూన్‌సంస్థలు 400 బెంగళూరులో ఉండడం ద్వారా పరిశోధనలు, అభివృద్ధికి అవకాశం లభిస్తుందన్నారు. బెంగళూరుకు అనుబంధంగా మెడికల్, టెక్, సెమికండక్టర్, ఎలక్ట్రానిక్ ఉపకరణాల పరిశ్రమలకు అనుకూలం చేశామని, తుమకూరులో మిషన్‌టూల్స్, కొప్పళ, బళ్ళారిలో ఐరన్ ఖనిజంలాంటి పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వదలిచామన్నారు. మరో వారం రోజుల్లో రెండో విమానాశ్రయానికి సంబంధించి స్థలాన్ని ఖరారు చేస్తామన్నారు. కొందరు ఉత్తర కర్ణాటక, మరికొందరు వివిధ ప్రాంతాలలో సూచిస్తున్నారని అన్నింటికంటే ప్రయాణీకులకు భవిష్యత్తు దశాబ్దాలలో అనుకూలంగా ఉండాలనేది తమ ఆశయమన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఎంబీ పాటిల్, అధికారులు



భారత, శ్రీలంక జట్ల సభ్యులు

వన్ వరల్డ్.. వన్ ఫ్యామిలీ.. విజేత భారత్



ట్రోఫీ అందజేస్తున్న టీబీ జయచంద్ర

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా సత్యసాయి గ్రామం ముద్దేనహళ్ళిలో జరిగిన వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ క్రికెట్ టోర్నమెంటులో భారతజట్టు 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. శనివారం శ్రీలంక, భారత జట్ల మధ్య 20 ఓవర్ల మ్యాచ్ జరిగింది. ప్రముఖ క్రికెటర్‌లు ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, వెంకటేశ్ ప్రసాద్, అరవింద డిసిల్వా, ముత్తయ్య మురళీధరన్, చమిందావాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. సమాజంలో విద్య, ఆరోగ్య వ్యవస్థపై అవగాహన పెంచాలని పోటీలు జరపడం సంతోషమని మాజీ క్రికెటర్ సునిల్ గవాస్కర్ అన్నారు. క్రికెట్ పోటీలకు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది జీవనశైలిలో మార్పులు తీసుకొచ్చిందన్నారు. భారత్‌లో క్రికెట్ కేవలం ఆటగానే కాకుండా అదో ధర్మంగా మారిందని, క్రికెట్ దిగ్గజాలు మానవత్వపు ఆలోచనలతో పోటీలు జరపడం సంతోషమన్నారు. వెంకటేశ్ ప్రసాద్ మాట్లాడుతూ మానవతా ఆలోచనలతో క్రికెట్ ఆడేందుకు మైదానంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. శ్రీలంక జట్టు కెప్టెన్ శ్రీమార్వాన్ మాట్లాడుతూ మధుసూదనసాయి విశ్వమానవత్వచైతన్యంతో చేతులు కలపడం సంతోషంగా ఉందన్నారు. పోటీలు మధుసూదనసాయి పర్యవేక్షణలో జరగగా విజేత జట్టు కెప్టెన్ వెంకటేశ్ ప్రసాద్‌కు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి జయచంద్ర బహుమతి అందచేశారు. పోటీలు చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలిరాగా అంతర్జాతీయ క్రికెటర్‌లతో ఫొటోలు, సెల్ఫీలకోసం ఎగబడ్డారు.

నేటి నుంచి కుంభమేళా



స్నానపు ఘాట్‌ల కోసం ఇసుక బస్తాలతో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన

బెంగళూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విశ్వవ్యాప్తంగా ఎదురుచూసేలా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళా సాగుతున్న తరుణంలోనే కర్ణాటకలోనూ కుంభమేళా సోమవారం ప్రారంభం కానుంది. మైసూరు జిల్లా టి నరసీపురలోని త్రివేణిసంగమంలో కుంభమేళా జరగనుంది. మూడేళ్లకోసారి టి నరసీపురలో కుంభమేళా జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమకూడలులో కావేరి, కపిల, స్ఫటిక సరోవర సంగమాన్ని త్రివేణి సంగమంగా పిలుస్తారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీ, సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్రస్వామీజీ కుంభమేళాను సోమవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభించనున్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప కుంభమేళా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మాఘమాసంలో పుణ్యస్నానం చేసేందుకు లక్షలాదిమంది భక్తులు ఎదురుచూస్తున్నారు. కర్ణాటకతోపాటు సమీప ప్రాంతాల ప్రజలు కూడా పుణ్యస్నానం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

1989లో కుంభమేళా ప్రారంభమైంది. ప్రతి మూడేళ్లకోసారి జరుపుతున్నారు. కాగా కొవిడ్ కారణంగా మూడేళ్లక్రితం నిర్వహించలేదు. ప్రస్తుతం 13వ కుంభమేళాకు భారీగా ఏర్పాట్లు చేశారు.

చరిత్ర ఇదీ..


ప్రాచీనకాలంలో గుంజా నరసింహస్వామి ఆలయం ఈ ప్రాంతంలో ప్రాధాన్యం కలిగి ఉంది. అగస్త్యమహారుషి స్వయంగా ఇసుకతో లింగం చేసి పూజలు చేసినట్టు తెలుస్తోంది. అగస్త్యేశ్వర, హనుమంతేశ్వర ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ గంగాతీర్థం కంటే పవిత్రమైనదని ఈ ప్రాంత ప్రజలు భావిస్తారు. గుంజానరసింహస్వామి చేతిలోని త్రాసు నిర్దేశిస్తుందని అంటారు. భరద్వాజ రుష్యాశ్రమ, చౌడేశ్వరి దేవస్థానం, రుద్రపాద, అక్షయ వటవృక్షం, అశ్వత్థ వృక్షం, గుడి మండపాలు, వ్యాసరాజమఠం ఉన్నాయి. ప్రాచీనమైన పవిత్రత ఇక్కడి ఆలయాల్లో సంప్రదాయాలు రుజువు చేస్తాయి. అన్ని మతాలు, కులాలు సమ్మిళితమైన సంగమంగా పిలుస్తారు. కుంభమేళాలో భాగస్వాములయ్యే మఠాధిపతులు, స్వామీజీలను గుంజా నరసింహస్వామి ఆలయం నుంచి భగవాన్‌టాకీస్ సర్కిల్, లింక్‌రోడ్డు బస్టాండ్ మీదుగా ఆహ్వానించే సంప్రదాయం ఉంది. రాష్ట్రంలో జానపద, సాంస్కృతిక కళల్లో పేరొంది న బృందాలు మూడు రోజులపాటు తమ ప్రదర్శనలను ఇవ్వనున్నాయి. ఇప్పటికే పలు బృందాలు చేరుకున్నాయి. కుంభమేళాలో పాల్గొనే భక్తులకోసం ఇక్కడి ప్రజలు, సంఘసంస్థలు నిత్యం అన్నదానం చేసేందుకు సిద్ధమయ్యాయి.



గుంజా నరసింహస్వామి ఆలయం



స్వామివారి మూలవిరాట్టు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1614.42	1,588.04
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,232	87
నీటి నిల్వ (టీఎంసీలు)	47.06	9.47

నేడు కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో వాసవీమాత

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బెంగళూ రు రోడ్డులో ఉన్న కన్య కా పరమేశ్వరి ఆల యం 105వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆల య కమిటీ సభ్యుడు గాదెం గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం మాఘ శుద్ధ త్రయోదశి ఉదయం అమ్మవారికి క్షీరాభిషేకం, వాసవీ నిత్య హోమం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది నుంచి కన్యకా పరమేశ్వరి పురాణ పారాయణం చేపడుతున్నామన్నారు. 600మంది భక్తులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సదాప్,పింజార్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సదాప్, పింజార్ నాయకులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నగరంలో సదాప్, పింజార్ జిల్లా ప్రధాన కార్యాలయాన్ని బళ్లారి డివిజన్ ఉపాధ్యక్షుడు షాసాబ్, జిల్లా అధ్యక్షుడు పి.మౌలాలి ప్రారంభించారు. బళ్లారి మహానగర పాలికె ప్రతిపక్ష నాయకుడు ఇబ్రహీంబాబు,రాష్ట్ర కార్యదర్శి సలీం, రియాజ్, డైరెక్టర్ ఫిరోజ్, రాష్ట్రకార్యనిర్వాహక కమిటీసభ్యులు దాదా ఖలందర్, అల్లాబకాష్, మహిళా అధ్యక్షులు అమీనా బీ, అన్ని తాలూకాలల అధ్యక్షులు ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయంలో జిల్లాకార్యనిర్వాహక బోర్డు సమావేశాన్ని నిర్వహించారు.

జయంతులను ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, ఫిబ్రవరి 9(ఆంధ్ర జ్యోతి): ప్రముఖుల జయంతులను ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో 15వతేదీన దేవరాజు జయంతి, 19న ఛత్రపతి శివాజీ, 20న సర్వజ్ఞ జయంతిలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పూర్వాపరాల సిద్ధత సమావేశం నిర్వహించారు. ఆయా సమాజానికి చెందిన పదాధికారులు పాల్గొని జయంతులను ఆచరించడంపై చర్చించారు. వేదిక, ఊరేగింపు వివిధ కార్యక్రమాలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, తాలుకా, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ సమాజ సభ్యులు పాల్గొన్నారు.

రెండు షాదీఖానాలు మంజూరు: ఎంపీ నాసిర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య నగరంలో రెండు ముస్లింల వివాహాల కోసం రెండు షాదీఖానాల నిర్మాణికి ప్రత్యేక నిధులు మంజూరు చేశారని రాజ్యసభ సభ్యుడు సయ్యద్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం నగరశివారులోని ఓ ప్రవేట్ హాల్లో ముస్లింలు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతలలో ముస్లింల సంఖ్య ఎక్కువగా ఉందని, అందుకే రెండు షాదీఖానాలు అవసరమని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే



ముస్లిం మతపెద్దలకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ నాసిర్ హుస్సేన్

నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన వారిపేర్లను చరిత్ర నుంచి తుడిచివేయడానికి ఎవరైనా ప్రయత్నించవచ్చు కానీ అమరవీరుల పేర్లను తొలగించలేమన్నారు. బళ్లారిలో 21 మసీదులకు రూ.2.20 కోట్ల గ్రాంట్ తీసుకొచ్చానని, రెండు షాదీమహాళ్లకు రూ.3 కోట్ల గ్రాంట్ తీసుకొచ్చానని తెలిపారు. ఎన్నికల సమయంలో షాదీ మహల్ గురించి ప్రస్తావించినప్పుడు మీ ఆశీస్సులతో మైనారిటీ వర్గాల కాలనీల అభివృద్ధికి ఒకే రోజులో రూ.5 కోట్ల విలువైన పనులకు ప్రారంభించానని ఆయన అన్నారు. హిందూ, ముస్లీంల ఐక్యత తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని మత సామరస్యాన్ని కాపాడుకోవడం మా బాధ్యత అని ఆయన హామీ ఇచ్చారు. మేయర్ ముల్లంగి నందీశ్, హుమయూన్‌ఖాన్, శివరాజ్ హెగ్డే, రామాంజనేయులు పాల్గొన్నారు.

ధర్మకర్త కుటుంబాన్ని బయటకు పంపిన ఈఓ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హరావినహగడలి తాలూకాలోని మైలార్ దేవస్థానం ధర్మకర్తల కుటుంబ సభ్యులను కార్యనిర్వహక అధికారి హనుమంతప్ప ఆలయం నుంచి బయటకు పంపించారు. మైలార్ దేవస్థానంలో ధర్మకర్త వెంకప్పయ్య ఒడెయార్ కుటుంబ సభ్యుడైన సురేంద్ర ఒడెయార్‌ను ఆదివారం ఆలయ కార్యనిర్వాహక అధికారి(ఈఓ) హనుమంతప్ప ఆలయం నుంచి బయటకు పంపడంతో కొంత సేపు గందరగోళ వాతావరణం నెలకొంది. ధర్మకర్త వెంకప్పయ్య కుమారడు సురేంద్ర ఎప్పటిలాగే విధుల్లో ఉన్నారు. ఈఓ హనుమంతప్ప వచ్చి పూజారులు తప్ప అనధికార వ్యక్తులను ఆలయంలోకి అనుమతించరని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలమేరకు వారిని బయటకు వెళ్లమని ఆదేశించారు. వారు అంగీకరించకపోవడంతో ఈఓ వారి చేయిపట్టుకుని బయటకు పంపారు. ఈ చర్యను ధర్మకర్త కుటుంబం వ్యతిరేకించింది. అధికారులు మాకుటుంబం పట్ల అహంకారం ప్రదర్శించారని, మా హక్కులను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం న్యాయం చేయాలని, లేనిపక్షంలో కోర్టుకు వెళ్తామని ధర్మకర్త వెంకప్పయ్య అన్నారు.



ధర్మకర్త కుటుంబ సభ్యుడిని చేయిపట్టుకుని లాగుతున్న ఈఓ హనుమంతప్ప

వైద్య శిబిరాలను వినియోగించుకోండి



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సుమతి అభిజిత్‌గౌడ

కంప్లి, ఫిబ్రవరి 9(ఆంధ్ర జ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు మూకయ్య స్వామి కోరారు. కంప్లి పట్టణంలోని శారద పాఠశాలలో ఆదివారం గంగావతి వివేకానంద హాస్పిటల్ డాక్టర్లు అభిజిత్ శ్రీనివాస్ గౌడ, సుమతి అభిజిత్ గౌడ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మూకయ్యస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతోమంది పేద కుటుంబాల వారు సరైన చికిత్స లేక ఇళ్లకే పరిమితం అయ్యారన్నారు. అలాంటి వారిని దృష్టిలో వుంచుకుని ఈ శిబిరాల ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 300 మందికిపైగా రోగులకు చికిత్సలు చేశారరు. వాలికొటప్ప, వాగేష్ అలీ అహ్మద్, సిద్ద రమేష్, జెరీనా జయశ్రీ, కన్నేరెష్, హులిగప్ప పాల్గొన్నారు.

కుడితిని సమస్యలపై దృష్టి సారించండి

- ఎమ్మెల్యే, ఎంపీలకు కౌన్సిలర్ల డిమాండ్

కంప్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో సమస్యలపై ఎమ్మెల్యే, ఎంపీలు దృష్టి సారించాలని పట్టణ పంచాయతీ కౌన్సిలర్ హులప్ప డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2018లో కౌన్సిలర్లు ఎన్నుకున్నారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టణ పంచాయతీలో జరిగే సమావేశాల్లో ఒక్కసారి కూడా ఎమ్మెల్యే హాజరుకాలేదన్నారు. వార్డుల్లోని సమస్యలు ఎన్నిసార్లు సమావేశాల్లో తెలియజేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ నెల 15న జరిగే సమావేశంలో అయినా పట్టణ పంచాయతీ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొని సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్ హులప్ప


ఆసనాలతో ఆరోగ్యం పదిలం

● పతంజలి రాజ్యసమితి సభ్యుడు డాక్టర్ ఎస్‌బీ హంద్రాల్

హోస్పేట (విజయనగరం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు 12 ఆసనాలతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని పతంజలి రాజ్యసమితి సభ్యుడు డాక్టర్ ఎస్‌బీ హంద్రాల్ అన్నారు. యోగా గురువు బాబా రామ్‌దేవ్ రోజూ 12 ఆసనాలు వేయాలని సూచించారన్నారు. ఆదివారం ఇక్కడి ఫ్రీడమ్ పార్కులో ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండూకాసన, శశశాసన, గోముఖాసన, వక్రాసన, పశ్చిమోత్తసన, మకరసాన, భుజంగాసన, శులభాసన, ధనురాసన, పవన ముక్తాసన, పాదవృత్తాసన, ద్విచక్ర ఆసనాలను ప్రతిరోజు సాధన చేయాలని సూచించారు. ఆయన చేతన భస్త్రికా ప్రాణాయామంపై ప్రత్యేక శిక్షన ఇచ్చారు. ఐదు ముద్రలను వర్తింపజేయడం ద్వారా ఈ ప్రాణాయామం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చేతన ప్రాణాయామం ద్వారా మనలో నిర్మాణాత్మక వైఖరిని నింపుతుందన్నారు. నేను ఆరోగ్యంగా ఉన్నాను, నాకు కోపం లేదు, నేను ప్రశాంతంగా ఉన్నాను, నేను ఎల్లప్పుడూ సానుకూలంగా ఆలోచిస్తాను అనే ఆలోచనతో మనస్సు ఉన్నప్పుడు శరీరం ఆరోగ్యంగా వుంటుందని ఆయన అన్నారు. ఆయన మూడు రకాల నాది శోధన, నాది నిర్వక్త ప్రాణాయామం గురించి వివరించారు. శరీర ఆరోగ్యానికి, ఆరోగ్యకరమైన జీవితానికి ఇది చాలా ముఖ్యమైనదని అన్నారు. పతంజలి యోగా కమిటీ రాష్ట్ర యువజన ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు బాలచంద్ర శర్మ, జిల్లా ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్ హళ్లికేరి, సీనియర్ యోగా సాధకులు అశోక్ చిత్రగార్, ప్రకాష్ కులకర్ణి, అనంత్ జోషి, వెంకటేష్, సత్యప్ప, మంగళమ్మ పాల్గొన్నారు.



ఫ్రీడమ్ పార్కులో యోగాసనాలు చేస్తున్న ప్రజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే గాలి

గంగావతి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గంగావతి నియోజకవర్గ అభివృద్ధికి శాయ శక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆనెగొంది పరిధిలోని గ్రామాల్లో రూ 51.01లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రూ.250 కోట్లతో అంజనాద్రి దేవాలయం చూట్టూ మండపాలు, ప్రసాద నిలయం, ప్రదక్షిణ పథం, వాల్మీకి మండపం, స్నాన ఘట్టాలతో పాటు పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అంజనాద్రి దేవాలయం అభివృద్ధి చేస్తే పర్యాటకులు, భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. దీంతో ఆనెగొందితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఉద్యోగం, వ్యాపారానికి అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాహసీల్దారు నాగరాజు, ఆనెగొంది గ్రామ పంచాయతీ అధ్యక్షులు హులిగమ్మ, హొన్నప్ప నాయక్, సంగాపుర గ్రామ పంచయతీ మంజమ్మ, లోకేష్, మల్లికార్జున స్వామి హిరేమఠతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీమా సంస్థను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బీమా సంస్థను కాపాడుకోవాలని ఆల్ ఇండియా ఇన్సురెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ మిశ్రా అన్నారు. నగరంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీమా సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడారు. ఐఆర్‌డీఏ విధానాలు, మార్పులు, ప్రభుత్వం అనుసరిస్తున్న చెడు విధానాలు, ప్రతికూల ప్రభావాలు, సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. నగరంలో రెండు బీమా కార్యాలయలు ఉండేవని, ప్రస్తుతం ఒకటే పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో 150 మంది ప్రతినిధులు, ఉద్యోగులు, క్లాస్-1 అధికారులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

రిమ్స్‌లో పీజీ విద్యార్థిని అదృశ్యం



భాగ్యలక్ష్మి(ఫైల్)

రాయచూరు, ఫిబ్రవరి 9: నగరంలోని రిమ్స్ వైద్య విద్యాలయంలో పీజీ చదువుతున్న విద్యార్థిని భాగ్యలక్ష్మి అదృశ్యమైంది. కలబుర్గి ప్రాంతానికి చెందిన డాక్టర్ భాగ్యలక్ష్మి 15 రోజుల క్రితం ఎంఎస్ చదివేందుకు రిమ్స్ వైద్య కళాశాలలో చేరారు. శనివారం స్నేహితులతో కలిసి వారి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన భాగ్యలక్ష్మి తిరిగిరాకపోగా ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో తోటి విద్యార్థినులు అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తల్లి రాధా రిమ్స్ కళాశాల ఉన్నతాధికారుల వేధింపుల వల్లే కూతురు అదృశ్యమైందని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు మార్కెట్ యార్డు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ పుట్టమాదయ్య

రాయచూరు, ఫిబ్రవరి 9: తాళం వేసి ఉన్న ఏటీఎంలోకి చొరబడి సొమ్మును కాజేసేందుకు ప్రయత్నించిన దొంగను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన జిల్లాలోని సింధనూరు నగరంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. 10 గంటల తరువాత రాయచూరు రోడ్డు సర్కిల్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంకు తాళం వేయగా గమనించిన నిందితుడు ఫైబర్ తలుపులను విరిచి లోపలికి ప్రవేశించాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న పోలీసుల బృందం దూరం నుంచి అనుమానించి వెంటనే అక్కడి వెళ్లి చూడగా తలుపు విరిగి ఉండడం గమనించి అందులో ఉన్న దొంగను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా దొంగతనం చేసేందుకు యత్నించినట్లు దొంగ ఒప్పుకున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ఎస్పీ పుట్టమాదయ్య ఆదివారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులను అభినందించారు.

హోసూరు జోన్

కాలుష్యానికి అడ్డుకట్ట వేసేదెన్నడో..?



దుమ్ముధూళిలో వాహనదారుల ఇబ్బందులు

హోసూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం పారిశ్రామికవాడగా ఉండడంతో ఇటీవలికాలంలో కాలుష్యం అధికమైంది. దీనికితోడు వాహనాల సంచారం పెరగడంతో వాయుకాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెంగళూరు-చెన్నై రహదారికి ప్రధానమైన రహదారిలో హోసూరు ఉంది. ఈ మార్గంలో రద్దీ అధికంగా ఉంది. ప్రత్యేకించి హోసూరు నుంచి సమత్వపరం దాకా సుమారు 5కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనాల సంచారం వేళ దుమ్ము రేగి ప్రయాణీకులు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు నేషనల్ హైవే ఫ్లై ఓవర్ నుంచి నగరం మధ్యలో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ, రోడ్డు నిర్వహణ పనులు జరుగుతున్నాయి. వీటిని కూడా వేగిరంగా పూర్తి చేయాలని నగరప్రజలు కోరుతున్నారు.

వంద మందికిపైగా కాంగ్రెస్‌లోకి చేరిక

హోసూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎంపీ గోపినాథ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో వందమందికిపైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. హోసూరు సమీపంలోని ఉదయనల్లూరు నాకొండపల్లికి చెందిన వందమందికిపైగా యువకులు న్యాయవాది ధనంజయన్ ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలతో ఎంపీ ఆత్మీయంగా స్వాగతించారు. ప్రజా సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ యువతకు ఆదర్శంగా ఉన్నారన్నారు.



పార్టీలో చేరిన కార్యకర్తలు

కరుమారియమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

హోసూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని బేగేపల్లి రోడ్డు చెక్‌పాయింట్ సమీపాన జూజువాడిలోని శ్రీదేవి కరుమారియమ్మ దేవాలయ 30వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గణపతి హోమం, లక్ష్మీపూజ, దీపపూజ, గంగపూజ, హోమాదికాలు నిర్వహించారు. కోటమారియమ్మన్, తోపుమారియమ్మన్, మునీశ్వర, ఎల్లమ్మాళ్, కరుమారియమ్మన్, ముత్తు మారియమ్మన్ దేవతల పల్లకీ ఊరేగింపు జరిగింది. గ్రామస్థులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

హోసూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని సరస్వతినగర్ ప్రాంతంలోని ముద్ర డ్యాన్స్‌స్కూల్ రెండో వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. డ్యాన్స్ స్కూల్‌లో 70మందికిపైగా విద్యార్థులు భరతనాట్యం, కూచిపూడి, మోహినీయాట్టం, కేరళనృత్యం నేర్చుకుంటున్నారు. పాఠశాల ద్వితీయ వార్షికోత్సవం శనివారం జరిగింది. అంజన, మిథున్‌లు నృత్య పాఠాలు బోధిస్తున్నారు. వీరు గతంలో గిన్నిస్ రికార్డు సృష్టించారు. వార్షికోత్సవంలో కూచిపూడి నృత్య ప్రదర్శన సభికులను అలరించింది. పెద్దసంఖ్యలో నగరవాసులు పాల్గొన్నారు.



నృత్యప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కంప్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. కంప్లి పట్టణంలోని పాత బస్టాండు సర్కిల్‌లో జీఎంజీ మద్యంషాపు ఎదురుగా బొలెరో కిందపడి వ్యక్తి మృతిచెందాడు. కంప్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం పాత బస్టాండు వద్ద మద్యంషాపు ఎదురుగా బొలెరో వెనుకవైపు ఉన్న ప్రసాద్(23) అనే వ్యక్తిని డ్రైవర్ గమనించక ఢీకొన్నాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు మృతదేహాన్ని కంప్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంబేడ్కర్ స్వాభిమాన సంఘం అధ్యక్షుడు చెన్నప్ప మాట్లాడుతూ పాత బస్టాండ్ సర్కిల్లో రెండు వైన్ షాపులు వుండటం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాధికారులు మద్యం షాపులను తొలగించాలని కోరారు.

కారు, బైకు ఢీకొని ఒకరు..

రాయచూరు: కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృత్యువాతపడిన ఘటన శనివారం రాత్రి కల్లూరు స్టేజ్ సమీపంలో చోటు చేసుకుంది. సిరవార తాలూకా కల్లూరు వద్ద బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెనుక కూర్చున్న వ్యక్తి సింధనూరు తాలూకా చిరతనాళ గ్రామానికి చెందిన నింగప్ప(57) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని సిరవార పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



బొలెరో కిందపడి మృతిచెందిన ప్రసాద్